క్లుప్తంగా

నేడు గాంధీ భవన్‌లో కాంగ్రెస్ నేతల దీక్ష

మోతీనగర్: రాహుల్ గాంధీపై అనర్హత వేటును నిరసిస్తూ టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి ఆదివారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు గాంధీభవన్‌లో దీక్ష చేపట్టనున్నారు. కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు మద్ధతు తెలపాలని బి బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గోపిశెట్టి రాఘవేందర్ ఓ ప్రకటనలో కోరారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే వేడుకలు



గ్రాడ్యుయేషన్ డే వేడుకల్లో పాల్గొన్న చిన్నారులు

భాగ్యనగర్‌కాలనీ: భాగ్యనగర్ కాలనీలోని బచ్‌పన్ పాఠశాలలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో డైరెక్టర్ మురళీధర్‌రెడ్డి, ఇందులత, ప్రిన్సిపాల్ నవనీత పాల్గొన్నారు.

నేడు బీఆర్ఎస్ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఉదయం 10 గంటలకు పాపారాయుడు నగర్‌లోని అశోక్‌గార్డెన్స్‌లో నిర్వహించనున్నట్లు కార్పొరేటర్ మాధవరం రోజాదేవి శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి ఎమ్మెల్సీ ఎల్. రమణ, చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ హాజరుకానున్నట్లు తెలిపారు. సమావేశానికి ఉద్యమకారులు, బీఆర్‌యస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

జీహెచ్ఎంసీ అధికారుల ప్రత్యేక పూజలు



పూజల్లో పాల్గొన్న అధికారులు రవికుమార్, రవీంద్రకుమార్ తదితరులు

మూసాపేట: బాలాజీనగర్ డివిజన్ ఆంజనేయ నగర్ కాలనీలోని ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం జీహెచ్‌యంసీ మూసాపేట సర్కిల్ డిప్యూటీ కమిషనర్ రవికుమార్, కూకట్‌పల్లి సర్కిల్ డిప్యూటి కమిషనర్ రవీంద్రకుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పాండు గౌడ్, కాలనీ అధ్యక్షుడు మున్నా, బాలాజీనగర్ డివిజన్ బీఆర్‌యస్ అధ్యక్షుడు ప్రభాకర్ గౌడ్, నాయకులు కర్క పెంటయ్య, కృష్ణంరాజు, అంజిగౌడ్, ఆనందద్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ...



రాజేంద్రగౌడ్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి: ఆల్విన్‌కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ సోదరుడు దొడ్ల రాజేంద్ర గౌడ్ దశదినకర్మ కార్యక్రమం శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు దొడ్ల రాజేంద్రగౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు.

సంగీతం సమున్నతం...



మాట్లాడుతున్న గాయకుడు శ్రీకృష్ణ

సాక్షి, సిటీబ్యూరో: మనసును రంజింపజేసే సంగీతం వినడం ఆస్వాదించడం అలాగే ఇతరులకు పంచడం కూడా గొప్ప వరం అన్నారు ప్రముఖ యువ సినీ గాయకుడు శ్రీకృష్ణ. కూకట్‌పల్లిలోని విజయ్‌నగర్ కాలనీలోని మ్యూజికల్ సంగీత అకాడమీ నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాటలు పాడడం, వాయిద్యాలను పలికించడం...ఇలా సంగీతంలో ఉన్న అన్ని రకాల కళలకూ ఒకే వేదిక ద్వారా శిక్షణ ఇవ్వాలనే ఆలోచన బాగుందన్నారు. కార్యక్రమంలో అకాడమీ నిర్వాహకులు లక్ష్మీనారాయణ ఏలూరి మాట్లాడుతూ కీబోర్డ్స్, గిటార్ తదితర వాయిద్య పరికరాలతో పాటుగా కర్నాటక వోకల్స్, హిందూస్తానీ వోకల్స్‌లో, పాశ్చాత్య, భారతీయ సంగీత రీతుల్లో శిక్షణ అందిస్తున్నామని తెలిపారు.

కార్యకర్తలే పార్టీకి బలం



సమావేశంలో పాల్గొన్న శంభీపూర్ రాజు, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే వివేకానంద్, మర్రి రాజశేఖర్‌రెడ్డి..



హాజరైన బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు

దుండిగల్: కార్యకర్తలే పార్టీకి బలమని, వారి సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రభుత్వం ఎల్లప్పుడు కృషి చేస్తుందని రాష్ట్ర రైతుబంధు సమితి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం గండిమైసమ్మలోని మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సన్నాహక సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి రాష్ట్ర రైతుబంధు సమితి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, మల్కాజ్‌గిరి పార్లమెంట్ ఇన్‌చార్జి మర్రి రాజశేఖర్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యమకారులు, ప్రతి కార్యకర్తకు బీఆర్ఎస్ పార్టీ తగిన గుర్తింపునిస్తుందన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలో దేశంలోనే నంబర్ వన్‌గా తెలంగాణ రాష్ట్రం నిలుస్తోందన్నారు. స్వరాష్ట్రం సాధించిన నాటి నుండి అన్ని రంగాల్లో పురోగతి సాధిస్తోందన్నారు. బీజేపీ కేవలం మతాన్ని అడ్డుపెట్టుకుని రాజకీయాలు చేస్తుందన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో తెలంగాణ పథకాలు అమలు చేసి చూపించాలని సవాల్ చేశారు. 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి మోసం చేసిన కేంద్ర ప్రభుత్వానికి రానున్న రోజుల్లో ప్రజలు గుణ పాఠం చెబుతారన్నారు. ప్రజల్లో ఉన్న ఆదరణ చూసి ఓర్వలేక ఈడీ, ఐటీ దాడులు చేస్తూ బీఆర్ఎస్ నేతలను ఇబ్బందులు పెడుతున్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో దేశవ్యాప్తంగా పార్లమెంట్ సీట్లలో పోటీ చేసి గులాబీ జెండా ఎగురవేస్తామన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో రాబోయే రోజుల్లో ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించడం జరుగుతుందని, అందుకు కార్యకర్తలు సిద్ధంగా ఉండాలన్నారు. విపక్షాల దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని, ప్రభుత్వ పథకాలు అర్హులైన వారికి అందించేందుకు చర్యలు తీసుకోవాలని కార్యకర్తలకు సూచించారు. సమావేశంలో ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, మున్సిపాలిటీల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, నియోజకవర్గ బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు, డివిజన్ల అధ్యక్షులు, మహిళా అధ్యక్షురాలు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

విప్లవ వీరులకు ఘన నివాళి



సభలో పాల్గొన్న సీపీఎం నాయకులు

కూకట్‌పల్లి: సీపీఎం కూకట్‌పల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో హైదర్‌నగర్ బస్తీ ప్రభుత్వ పాఠశాలలో శనివారం భగత్‌సింగ్, రాజ్ గురు, సుఖదేవ్‌ల వర్ధంతి సభ నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి మేడ్చల్ జిల్లా నాయకుడు ఎం. శంకర్, గిరిజన సంగం నాయకుడు కృష్ణనాయక్, కేవీపీఎస్ జిల్లా నాయకుడు బాలపీరు స్థానిక నాయకులు బి. శ్రీను పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశం కోసం అతి చిన్న వయస్సులోనే ప్రాణాలర్పించిన అమరవీరులకు జోహార్లు అర్పిస్తున్నామన్నారు. మీ బలిదానం వృథా కాదని మీ ఆశయాలను ముందుకు తీసుకెళ్తామని ప్రతిజ్ఞ చేశారు. మతోన్మాదానికి, కులతత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నేటి తరం యువత, విద్యార్థులు, ప్రజలు వారి ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ప్రస్తుత మోదీ ప్రభుత్వం మతోన్మాదాన్ని పెంచి పోషిస్తుందని మైనార్టీలు, ముస్లింలు, దళితులపై, మహిళలపై దాడులు పెరిగాయన్నారు. హత్యలను అరికట్టడంతో ప్రభుత్వం విఫలమైందన్నారు. మరోపక్క ధరలు పెరిగిపోయాయని, పేదవాడు కొనలేని, తినలేని పరిస్థితి దాపురించిందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలన్నిటిని పెట్టుబడిదారులకు ధారాదత్తం చేస్తున్నారని ఆరోపించారు. రానున్న రోజుల్లో ప్రజాస్వామికవాదులు, లౌకికతత్వవాదులు, యువజనులు, విద్యార్థులు, ప్రజలందరు ఐక్య ఉద్యమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మహేష్, వెంకటేష్, నరసింహ, అశోక్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జనచైతన్య యాత్రను జయప్రదం చేయండి



జనచైతన్య యాత్ర పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న శంకర్ తదితరులు

కూకట్‌పల్లి: జనచైతన్య యాత్రను జయప్రదం చేయాలని సీపీఎం కూకట్‌పల్లి మండల కార్యదర్శి శంకర్ పేర్కొన్నారు. శనివారం కూకట్‌పల్లి సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో బీజేపీ ప్రభుత్వ వైఖరికి నిరసనగా మార్చి 23 నుంచి 29 వరకు నిర్వహించనున్న జన చైతన్యయాత్రను జయప్రదం చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పార్టీ నాయకులు కె. కృష్ణ నాయక్, బాలపీరు మాట్లాడుతూ బీజేపీ మతోన్మాద, కార్పొరేట్ విధానాలకు వ్యతిరేకంగా సంక్షేమం,మత సామరస్యం, ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం కోసం అఖిల భారత కమిటీ పిలుపు మేరకు జనచైతన్య యాత్రలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలు, ప్రజాస్వామిక వాదులు, మేధావులు ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో మహేష్, వెంకటేష్, నరసింహ, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు తీరని అన్యాయం



కూకట్‌పల్లి: బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని కూకట్‌పల్లి బీజేపీ ఇన్‌చార్జి మాధవరం కాంతారావు అన్నారు. 'మా నౌకరీలు మాగ్గావాలే' నినాదంతో తెలంగాణ ప్రభుత్వం నిరుద్యోగులకు చేస్తున్న అన్యాయాన్ని ప్రశ్నిస్తూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ పిలుపు మేరకు శనివారం నిర్వహించిన మహా ధర్నాకు కూకట్‌పల్లి నుంచి బీజేపీ శ్రేణులు బీజేపీ సీనియర్ నాయకుడు వడ్డేపల్లి రాజేశ్వరరావు ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో తరలి వెళ్లారు. ఈ సందర్భంగా కూకట్‌పల్లిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాధవరం కాంతారావు, వడ్డేపల్లి రాజేశ్వరరావు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం చేస్తుందన్నారు. తెలంగాణ వస్తే మన ఉద్యోగాలు మనకే వస్తాయని కొన్నేళ్లుగా తెలంగాణ యువత, నిరుద్యోగులు ఎదురు చూశారన్నారు. తెలంగాణ వచ్చి ఎనిమిదేళ్ల అయినా గ్రూప్ 1 నోటిఫికేషన్ వేయకపోవటం దారుణమన్నారు. ఇన్నేళ్లకు నోటిఫికేషన్ వేసినా అది కూడా పేపర్ లీక్ చేసి, ప్రశ్నా పత్రాలు అమ్ముకున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పేపర్ లీకేజీ ముమ్మాటికీ ప్రభుత్వ నిర్లక్ష్యమేనని, ఇందులో ప్రభుత్వ పెద్దల పాత్ర ఉందని ఆరోపించారు. గతంలోనూ ఎంసెట్ పరీక్ష పేపర్ లీక్ చేసి ఇంటర్ విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకున్నారని గుర్తు చేశారు. పేపర్ లీకేజీపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. పేపర్ లీకేజీకి కారణమైన మంత్రి కేటీఆర్‌ను బర్తరఫ్ చేయాలని, నిరుద్యోగులందరికీ రూ. లక్ష పరిహారం ఇవ్వాలని, నిరుద్యోగ భృతి కింద నెలకు రూ.10 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగులకు న్యాయం జరిగే వరకు బీజేపీ పోరాడుతూనే ఉంటుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు సూర్యప్రకాష్‌రావు, సూర్యారావు, శ్రీకరరావు, రవికుమార్ గౌడ్, నాగరాజు, వినోద్‌గౌడ్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏఐసీటీఈ ల్యాబ్ ప్రారంభం

నిజాంపేట్: ఏఐసీటీఈ ఐడియా ల్యాబ్స్ ఇంజినీరింగ్ విద్యార్థుల్లో నైపుణ్యాన్ని పెంపొందించేందుకు దోహదపడతాయని డివై పాటిల్ యూనివర్సిటీ ఉపకులపతి డా.ప్రభాత్ రంజన్ అన్నారు.శనివారం బాచుపల్లిలోని గోకరాజు రంగరాజు ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఏఐసీటీఈ ఐడియా ల్యాబ్(ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్)ను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డా.ప్రభాత్ రంజన్ మాట్లాడుతూ ఏఐసీటీఈ ఐడియా ల్యాబ్స్ దేశంలో 91 మాత్రమే ఉన్నాయన్నారు. ఒక విద్యార్థి ఒక మంచి ఆలోచనతో ఈ ప్రయోగశాలలో అడుగు పెడితే ఒక గొప్ప ఆవిష్కరణతో బయటకు వచ్చేలా ఇందులో అవసరమైన అన్ని పరికరాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఏఐసీటీఈ స్కాలర్‌షిప్స్, గ్రాంట్స్ సలహాదారు డా.నీరజ్ సక్సేనా మాట్లాడుతూ ఇంజినీరింగ్ విద్యార్థుల సాంకేతిక నైపుణ్య అభివృద్ధికి ఈ ప్రయోగశాల ఎంతో ఉపయోగపడుతుందన్నారు. గోకరాజు లాంటి ప్రైవేటు విద్యా సంస్థల సహకారంతో ఇలాంటి ప్రయోగశాల ఏర్పాటు సాకారమైందన్నారు. కార్యక్రమంలో కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వాణి గోకరాజు, ప్రిన్సిపాల్ డా.ప్రవీణ్, ఐడియా ల్యాబ్ సమన్వయకర్తలు బాలాజీ , రాధానంద్, ఎలక్ట్రానిక్స్ విభాగాధిపతి డాక్టర్ హిమబిందు పాల్గొన్నారు.

పార్కులను పరిరక్షించుకోవాలి



ఓపెన్ జిమ్‌లను పరిశీలిస్తున్న కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు

కేపీహెచ్‌బీకాలనీ: పార్కులను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ఆయా కాలనీల ప్రజలపై ఉందని స్థానిక కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు అన్నారు. శనివారం ఆయన కేపీహెచ్‌బీ డివిజన్‌లోని 9వ ఫేజు, ఎన్ఆర్ఎస్ఏ కాలనీ, సీబీసీఐడీ కాలనీలో ఓపెన్ జిమ్‌లను సందర్శించారు. ఈ సందర్భంగా పెండింగ్‌లో ఉన్న పనులను త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఏఈ సాయిప్రసాద్‌ను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేపీహెచ్‌బీ డివిజన్‌లో ఎక్కడికక్కడ పార్కులను అభివృద్ధి చేయడమేగాక ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సహకారంతో ఓపెన్ జిమ్‌లను ఏర్పాటు చేశామన్నారు. వీటిని ప్రజలు ఉపయోగించుకుని ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని తెలిపారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత

నిజాంపేట్: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రగతినగర్‌లో అక్రమ నిర్మాణాన్ని శనివారం టౌన్ ప్లానింగ్ అధికారులు కూల్చివేశారు. జి ప్లస్ టూ భవన నిర్మానానికి అనుమతి తీసుకున్న నిర్మాణదారుడు నాలుగు అంతస్తుల భవనం నిర్మించాడు. అతడికి నోటీసులు జారీ చేసిన అధికారులు అదనంగా నిర్మించిన నిర్మాణాన్ని స్లాబ్‌లు, గోడలు కూల్చివేశారు. కార్యక్రమంలో ఏసీపీ శ్రీనివాస్‌రావు, టీపీఎస్ ప్రశాంతి, ఆర్ ఐ శ్రీదేవి, డీటీఎఫ్ , మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై సమీక్ష

నిజాంపేట్: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై శనివారం మేయర్ కొలను నీలాగోపాల్‌రెడ్డి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో కమిషనర్ రామక్రిష్ణారావుతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ బడ్జెట్ ప్రతిపాదనలపై చర్చించారు. పలు ప్రాంతాల్లో చేపట్టాల్సిన రోడ్డు విస్తరణ పనులు, డ్రైనేజీ పనులు, వైకుంఠధామాల అభివృద్ధి, హరిత హారం, ఓపెన్ జిమ్‌ల ఏర్పాటు తదితర అంశాలపై ఆయా విభాగాల అధికారులతో సమీక్షించారు.

ప్రజాస్వామ్య చరిత్రలో బ్లాక్‌డే...

రాహుల్ గాంధీపై అనర్హత వేటు దారుణం : డా. సత్యం శ్రీరంగం



డా.సత్యం శ్రీరంగం
పీసీసీ సభ్యుడు

కూకట్‌పల్లి: బీజేపీ పాలనలో ప్రజా స్వామ్యానికి చీకటి రోజులు వచ్చాయని రాహుల్ గాంధీపై అనర్హత వేటు వేయటం నరేంద్ర మోదీ దురహంకారానికి, నియంతృత్వానికి నిదర్శనమని కాంగ్రెస్ సీనియర్ నాయకులు సత్యం శ్రీరంగం అన్నారు. నరేంద్రమోదీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం రాహుల్ గాంధీపై తప్పుడు కేసులు పెట్టి రెండు సంవత్సరాల జైలు శిక్ష పడేలా చేసిందన్నారు. కోర్టు నెల రోజులు గడువు ఇచ్చినా, మరోవైపు లోక్‌సభ స్పీకర్ ఆగకుండా రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా ఆయనను పార్లమెంట్ నుంచి బహిష్కరించడం దారుణమన్నారు. లోక్‌సభ స్పీకర్‌కు సభ్యుడిని చట్ట సభల నుంచి బహిష్కరించే అధికారాలు ఉన్నప్పటికీ, ఆ విచక్షణ అధికారం భారత రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా ఉండాలన్నారు. దేశ సంపదను దోచుకున్న ఆర్థిక నేరస్తులైన నీరవ్ మోదీ, లలిత్ మోదీలను దేశం దాటించి ప్రజలకు చెందాల్సిన సంపద ప్రజలకే చెందాలన్నందుకు రాహుల్‌ను అరెస్టు చేస్తారా అని ప్రశ్నించారు.

మోడల్ కార్పొరేషన్‌గా నిజాంపేట్

నిజాంపేట్: నిజాంపేట్‌ను మోడల్ కార్పొరేషన్‌గా తీర్చిదిద్దేందుకు సమష్టిగా కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. శనివారం ప్రగతి యాత్రలో భాగంగా బాచుపల్లిలో రాజీవ్ గాంధీనగర్, హిల్ కౌంటీ ప్రాంతాల్లో మేయర్ కొలను నీలాగోపాల్‌రెడ్డి, కమిషనర్ రామక్రిష్ణారావు స్థానిక కార్పొరేటర్లతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా రాజీవ్ గాంధీనగర్ 15వ వార్డులో పత్తికుంట వద్ద రూ.35 లక్షలతో నిర్మించిన చైన్ లింక్ మెష్, రూ.17 లక్షలతో భూగర్భ డ్రైనేజీ, రూ.15 లక్షలతో పూర్తి చేసిన సీసీ రోడ్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. మంచినీటి రిజర్వాయర్ నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం హిల్ కౌంటీ క్లబ్ హౌస్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో కాలనీ వాసులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. డంపింగ్ యార్డును నుంచి మరో చోటుకు తరలించాలని కోరారు. గ్రేవ్ యార్డును తరలించినందుకు ఎమ్మెల్యేకు కాలనీ వాసులు కృతజ్ఞతలు తెలిపారు. సర్వే నెంబర్ 186లో ఉన్న 10 ఎకరా స్థలంలో పరేడ్ గ్రౌండ్ ఏర్పాటు చేయాలని కోరారు. అదనపు ట్రాన్స్ ఫార్మర్‌లను సైతం ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటానన్నారు. తన దృష్టికి వచ్చిన అన్ని సమస్యలను వేగవంతంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డిప్యూటి మేయర్ ధన్‌రాజ్ యాదవ్, కార్పొరేటర్లు సుజాత, బాలాజీ నాయక్, డీఈఈ సుదర్శన్ రావు, వాటర్ వర్క్స్ డీజీఎం మహేశ్, బిఆర్ఎస్ ఎస్ఎంసి అధ్యక్షుడు రంగరాయ ప్రసాద్ , హిల్ కౌంటీ విల్లాస్ అధ్యక్షుడు డా.సునీల్ తదితరులు పాల్గొన్నారు.



రాజీవ్ గాంధీనగర్‌లో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్, మేయర్ నీలారెడ్డి

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్

మియాపూర్ : క్రీడల్లో రాణించిన వారికి ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ పేర్కొన్నారు. చందానగర్‌లోని పీజేఆర్ స్టేడియంలో జీహెచ్ఎంసీ కార్పొరేటర్స్ స్పోర్ట్స్ మీట్ -2023 క్రీడల్లో గెలుపొందిన వారికి బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గెలుపొందిన కార్పొరేటర్లకు ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, జోనల్ కమీషనర్ శంకరయ్యలు బహుమతులను అందజేశారు. షటిల్ బ్యాడ్మింటన్ పురుషుల విభాగంలో మొదటి స్థానం మాదాపూర్ కార్పొరేటర్ జగదీశ్వర్‌గౌడ్, మహిళా విభాగంలో కార్పొరేటర్ బొంతు శ్రీదేవిలు గెలుపొందారు.

నిజాయితీ చాటుకున్న డ్రైవర్, కండక్టర్

మియాపూర్: బస్సులో వదిలి వెళ్లిన బ్యాగును ప్రయాణికురాలికి అందజేసి నిజాయితీని చాటుకున్నాడు బస్సు డ్రైవర్. మియాపూర్‌లోని ఆర్టీసీ -2 డిపోకు చెందిన మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సు సికింద్రాబాద్ నుంచి మియాపూర్‌కు వెళుతోంది. సికింద్రాబాద్‌లో ప్రయాణికురాలు దీపిక బస్సు ఎక్కి మూసాపేట్‌లో దిగింది. ఈ క్రమంలో బస్సులోనే ఓ హ్యాండ్ బ్యాగును మర్చిపోయి వెళ్లింది. డిపోకు వచ్చిన తర్వాత కండక్టర్ నర్సింలు, డ్రైవర్ శ్రీనివాస్‌లు బ్యాగును పరిశీలించగా 22 గ్రాముల బంగారం, రూ.1300నగదును ఉన్నట్లు గుర్తించారు. డిపో మేనేజర్ కు సమాచారం, ప్రయాణికురాలు దీపికకు సమాచారం అందించారు. దీంతో ఆమె డిపోకు రావడంతో కండక్టర్, డ్రైవర్లు డిపో అధికారుల సమక్షంలో హ్యాండ్ బ్యాగును అందజేశారు. నిజాయితీని చాటుకున్న డ్రైవర్ శ్రీనివాస్, కండక్టర్ నర్సింలులను డిపో -2 మేనేజర్ అభినందించారు.

సమస్యల పరిష్కారానికి నిరంతర కృషి



హైదర్‌నగర్ డివిజన్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు తదితరులు



భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలో సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని స్థానిక కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు అన్నారు. శనివారం ఆయన నందమూరి నగర్ కాలనీలో జరుగుతున్న స్ట్రాం వాటర్ పైపులైన్ పనులను , జీహెచ్ఎంసీ అధికారులతో కాలనీ వాసులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్ట్రాం వాటర్ సమస్య పరిష్కారమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామన్నారు. పలు కాలనీల్లో ప్రజల నుంచి వచ్చిన వినతుల మేరకు అన్ని సమస్యలను పరిగణలోకి తీసుకుని డివిజన్‌లో అత్యవసరమైన, నిత్యం పొంగుతున్న ప్రాంతాల్లో తక్షణమే పనులు పూర్తి చేస్తామన్నారు. కాలనీల్లో ఏ చిన్న సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు. కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని, కాలనీలను ఆదర్శవంతమైన కాలనీలుగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమన్నారు. అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడకూడదని, ప్రజలకు స్వచ్ఛమైన, చక్కటి ఆహ్లాదకరమైనవాతావరణం కల్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్ మహదేవ్, ప్రసాద్, మాధవ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

బృందావన్ కాలనీలో...

బృందావన్ కాలనీలో డ్రైనేజీ పొంగుతోందని స్థానికులు కార్పొరేటర్ దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ఆయన శనివారం అధికారులతో కలిసి సంఘటనా స్థలాన్ని పరిశీలించి అక్కడికక్కడే జేసీబీ, ఎయిర్‌టెక్ మిషన్లతో సమస్యను పరిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదర్‌నగర్ డివిజన్‌లో నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తానన్నారు. కార్యక్రమంలో జలమండలి వర్క్ ఇన్‌స్పెక్టర్ మహదేవ్, జలమండలి మేనేజర్ ప్రశాంతి, హైదర్‌నగర్ డివిజన్ ఉపాధ్యక్షుడు కోనేరు రాగప్రసాద్, రవికుమార్, సూర్యనారాయణ, రాజేష్, సురేష్, గణేష్, కృష్ణప్రసాద్, నాగేశ్వరరావు, సత్యనారాయణ, సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.